నిరాడంబరంగా కవి కువెంపు జయంతి



కువెంపు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

8లో..



వయ్యాలికావల్‌లోని శ్రీవారి ఆలయం

వైకుంఠ ఏకాదశికి టీటీడీ ఆలయం ముస్తాబు

- కొత్త సంవత్సర వేడుకలకు ప్రత్యేక దర్శనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ

బెంగళూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని వయ్యాలికావల్‌లోగల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎండోమెంట్ ఆఫీసర్ పి బాలరాజు, సూపరింటెండెంట్ జయంతి తెలిపారు. 2025 జనవరి 10న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ప్రత్యేకమైన సౌలభ్యాలు కల్పిస్తున్నామన్నారు. తిరుమలకు వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకోలేని భక్తులకు టీటీడీకి అనుబంధమైన వయ్యాలికావల్ ఆలయంలో ఏడుకొండలస్వామి దర్శనభాగ్యం కల్పిస్తున్నామన్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ముందస్తుగా క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. వేకువజామున 3.30 గంటలకు దర్శనం ప్రారంభమవుతుందన్నారు. రాత్రి 12 గంటలవరకు అవకాశం ఉందన్నారు. గతేడాది వైకుంఠ ద్వార దర్శనంలో 68వేలమంది భక్తులు దర్శించుకున్నారన్నారు. ఈ ఏడాది అంతకుమించి భక్తులు వస్తారని భావిస్తున్నామన్నారు. అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు ప్రారంభించామన్నారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదం, లడ్డూప్రసాదం అందిస్తామన్నారు. ప్రస్తుతానికి ప్రత్యేక పాస్‌లు విడుదల చేసే అంశం నిర్ణయించలేదన్నారు. వీవీఐపీలకు ప్రత్యేకంగా సౌలభ్యం కల్పించనున్నామన్నారు.

నూతన సంవత్సరం ప్రారంభం బుధవారం రోజున టీటీడీ ఆలయంలో ప్రత్యేక దర్శన సౌలభ్యం ఉంటుందన్నారు. కొన్నేళ్లుగా సాగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు సౌలభ్యాలు ఉంటాయన్నారు. అన్నప్రసాదం ఉంటుందన్నారు. రద్దీ దృష్ట్యా 200 రూపాయల ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయదలిచామన్నారు. కొత్త సంవత్సరం ప్రారంభం రోజున ప్రత్యేక అలంకరణలు ఉంటాయన్నారు.



సీటీ రవి, నాగేంద్ర, ప్రజ్వల్, వర్తూరు ప్రకాశ్

బెంగళూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు అనూహ్యమైన సంచలనాలు అప్పుడప్పుడు చోటు చేసుకుంటాయి. అయితే 2024 సంవత్సరం రాష్ట్ర రాజకీయనేతలను కేసులు, అవినీతి ఆరోపణలు, లైంగిక ఆరోపణలు గడగడలాడించాయి. మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార 'ముడా'లో 14 ఇంటి స్థలాలను సీఎం భార్య పార్వతి పేరిట 50:50 నిష్పత్తిలో పొందడం సంచలనం రేపింది. నాలుగైదు నెలలుగా సీఎం సిద్దరామయ్యకు నిద్ర లేకుండా చేస్తోంది. ఇక రాష్ట్ర రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల పాటు కీలకనేతగా వ్యవహరించిన దేవెగౌడ కుటుంబం ఎన్నడూ లేనన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేవెగౌడ తనయుడు రేవణ్ణ చిన్న కొడుకు ప్రజ్వల్‌కు సంబంధించిన లైంగిక సీడీలు విడుదల కావడం కేసుల నమోదుతో అరెస్టు అయ్యాడు. ఫిర్యాదు చేసిన మహిళ కిడ్నాప్ చేశారని రేవణ్ణ జైలుకెళ్లగా భార్య భవాని ముందస్తు బెయిల్‌తో బయటపడ్డారు. రేవణ్ణ కుమారుడు సూరజ్ అసహజ లైంగిక ఆరోపణలతో అరెస్టు అయి బెయిల్‌పై విడుదలయ్యాడు. ఇక రాష్ట్రంలో మరో కీలక నేత, మూడుసార్లు సీఎంగా వ్యవహరించిన యడియూరప్ప పోక్సో కేసులో తలమునకలయ్యారు.

సంచలనమైన ముడా కేసు

సీఎం సిద్దరామయ్య భార్య పార్వతి పేరిట 50:50 నిష్పత్తిన 14 ఇంటి స్థలాలు పొందారని సామాజిక కార్యకర్తలు స్నేహమయి కృష్ణ, టీజే అబ్రహాంలు లోకాయుక్తకు, గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. గవర్నర్ ప్రాసిక్యూషన్‌లకు అనుమతులు ఇవ్వడంతో కేసు కీలకమైంది. సీఎం హైకోర్టును ఆశ్రయించగా అక్కడా ప్రాసిక్యూషన్ చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఆయన హైకోర్టు ఫుల్‌బెంచ్‌ను ఆశ్రయించినా మరోవైపు లోకాయుక్త, ఈడీలు విచారణ జరుపుతున్నాయి.

వాల్మీకి కార్పొరేషన్‌లో కోట్లు లూటీ

వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో లోక్‌సభ ఎన్నికలకు ముందు కోట్లాది రూపాయల గ్రాంట్లను బినామీ ఖాతాలకు బదిలీ చేశారు. కార్పొరేషన్ అకౌంట్స్ విభాగం అధికారి ఆత్మహత్యతో వివాదం వెలుగులోకి వచ్చింది. సంబంధితశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న బీ నాగేంద్ర మంత్రిపదవికి రాజీనామా చేశారు. ఏడాదిన్నర సిద్దరామయ్య పాలనలో అవినీతి ఆరోపణలతో పదవిని కోల్పోయిన తొలి మంత్రి అయ్యారు. అబ్కారీశాఖలో బదిలీలతోపాటు వివిధ అక్రమాల ద్వారా వందల కోట్లు సమకూర్చి మహారాష్ట్ర ఎన్నికలకు ఫండింగ్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. అబ్కారీశాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపురపై ప్రతిపక్ష బీజేపీ తీవ్రమైన ఆరోపణలు చేసింది. కాగా రాజ్యసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు వేళ విధానసౌధ కారిడార్‌లో పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయడం ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చింది.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఊరట

దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఐదేళ్లపాటు కేవలం ఒక్కసీటుకే పరిమితమైన కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున భారీగానే పుంజుకుంది. 9 స్థానాలను కైవశం చేసుకుంది. జేడీఎస్ కూడా ఒకే స్థానంతో ఐదేళ్లపాటు కొనసాగినా అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకుని బీజేపీతో పొత్తు కారణంగా మండ్య నుంచి కుమారస్వామి గెలుపొంది కేంద్రమంత్రి కాగా అదనంగా కోలారు స్థానం దక్కించుకుంది. ఇక బీజేపీ గతంలో 25మంది ఎంపీలు కలిగి ఉండగా 17కు తగ్గాయి. ఇండిపెండెంట్ ఎంపీగా కొనసాగి చివరిక్షణంలో బీజేపీవైపు వచ్చి టిక్కెట్ దక్కక నటి సుమలత ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు.

ప్రజ్వల్ వివాదం సంచలనం

హాసన్ జేడీఎస్ ఎంపీగా కొనసాగిన ప్రజ్వల్ రేవణ్ణ అశ్లీల వ్యవహారం జాతీయ, అంతర్జాతీయస్థాయిలో వివాదమైంది. వివిధ పనులు, బదిలీల కోసం మద్దతుకోరిన అధికారులు, ఉద్యోగులతోపాటు పలువురు మహిళలపై లైంగిక దాడికి పాల్పడి చిత్రీకరించుకున్న వీడియోలు సీడీలరూపంలో వైరల్ అయ్యాయి. దాదాపు ఐదు నెలలుగా ప్రజ్వల్ జైలులోనే గడుపుతున్నారు. ఫిర్యాదు చేసిన మహిళను కిడ్నాప్ చేశారనే కారణంతో మాజీ మంత్రి రేవణ్ణ అరెస్టు అయి బెయిల్‌పై విడుదలయ్యారు. ప్రజ్వల్ తల్లి భవాని కొన్నిరోజులపాటు అజ్ఞాతంలో గడిపి ముందస్తు బెయిల్ పొందారు. ప్రజ్వల్ అన్న సూరజ్ రేవణ్ణ అసహజ లైంగిక ఆరోపణలతో అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చాడు.

పోక్సో కేసులో యడియూరప్పకు ఇబ్బందులు

బీజేపీ అగ్రనేతగా వ్యవహరిస్తున్న యడియూరప్ప పోక్సో కేసులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయం కోసం బాలికతోపాటు తల్లి, యడియూరప్ప నివాసానికి వెళ్లినప్పుడు ఆయన అనుచితంగా ప్రవర్తించారని కేసు నమోదైంది. ఫిర్యాదు చేసిన తల్లి మృతి చెందినా కేసు మాత్రం కొనసాగుతోంది. బీజేపీకి చెందిన రాజరాజేశ్వరినగర్ ఎమ్మెల్యే మునిరత్నపై లైంగిక దాడి, హనీట్రాప్ ప్రయత్నంపై కేసులు నమోదయ్యాయి. తాజాగా ఇదేవారంలో కాంగ్రెస్ కార్యకర్తలు గుడ్లతో దాడి చేశారు. ఈ వివాదం కొనసాగుతోంది. ఇక డీసీఎం డీకే శివకుమార్‌కు ఈడీ సమన్లతో అవినీటి మచ్చ తప్పలేదు. బెళగావిలో జరిగిన శాసనసభ శీతాకాల సమావేశాలలో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పట్ల బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి అనుచితమైన వ్యాఖ్యలు చేశారనే వివాదం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. ప్రభుత్వం ఓవైపు సీఐడీ దర్యాప్తుకు ఆదేశించగా పరిషత్‌లో జరిగిన వివాదం పోలీసుల విచారణ వరకు వెళ్లడం సరికాదని సభాపతి హొరట్టి అభిప్రాయపడ్డారు. ఈ వివాదం ఇంకా కొనసాగుతోంది. తాజాగా మాజీ మంత్రి వర్తూరు ప్రకాశ్ పేరు చెప్పి శ్వేతాగౌడ అనే యువతి కోట్లరూపాయల బంగారం తీసుకున్నారనే కేసు విచారణదశలో ఉంది. ఇక మాజీ ఎంపీ డీకే సురేశ్ చెల్లెలుగా చెప్పుకొన్న ఐశ్వర్యగౌడ ఏకంగా 8 కోట్ల రూపాయల బంగారం తీసుకున్నారనే కేసులో అరెస్టు అయ్యారు. ఈమెపై పలు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నాయకుడిగా కొనసాగిన ఎస్ఎం కృష్ణ మృతితో బెంగళూరు అభివృద్ధి కారకుడు దూరమైనట్టు అయ్యింది. ఇలా రాష్ట్ర రాజకీయాల్లో ఏడాది పొడవునా ఏదో ఒక అంశం రాజకీయ నాయకులను వెంటాడింది.



ఎమ్మెల్యే మునిరత్నపై కోడిగుడ్ల దాడి

అభిషేక్‌కు ఆరు పతకాలు

- జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్‌లో బెంగళూరు యువకుడి ప్రతిభ

బెంగళూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలలో బెంగళూరుకు చెందిన అభిషేక్ శేఖర్ 6 పతకాలతో సత్తా చాటారు. 67వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీలలో 6 పతకాలతో కర్ణాటకలోనే మొదటిషూటర్‌గా నిలిచారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో రాష్ట్రషూటింగ్ అకాడమీలో జాతీయస్థాయి పోటీలు జరుగుతున్నాయి. అభిషేక్ టీమ్ పోటీల్లో మూడు బంగారు పతకాలు, జూనియర్ మెన్ ఫైనల్స్‌లో రజత పతకాన్ని సాధించారు. 18ఏళ్ల అభిషేక్ జాతీయస్థాయి షూటింగ్ పోటీల్లో తనదైన ముద్ర చాటారు. ఓపెన్‌సైట్ షూటింగ్‌లో అన్ని విభాగాల్లో బంగారు పతకాన్ని సాధించి ప్రయాణాన్ని ప్రారంభించారు. కొవిడ్ కారణంగా రెండేళ్లపాటు విరామం తీసుకుని 2022 నుంచి మళ్లీ షూటింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. అభిషేక్ రాష్ట్రస్థాయి షూటింగ్‌లో జగడేల్ షూటింగ్ పోటీలు, దసరా కమ్ ఆలిండియా జీవి మావలంకర్ పోటీల్లోనూ రాణించారు. కోచ్ రామచంద్రన్ పురుషోత్తమ్ మాట్లాడుతూ కోచింగ్‌లో అభిషేక్ నిబద్ధత, ధృడమైన ఆలోచన కలిగి ఉంటారన్నారు. పోటీ ల్లో 13వేల మందికిపైగా పాల్గొన్నారని ఏకంగా 6 పతకాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు.



అభిషేక్

పట్టుదలకు జైశ్రీ

అనస్తీషియా ఇంజక్షన్‌తో కాళ్లు కోల్పోయిన జయశ్రీ
వైకల్యాన్ని ఎదిరించి స్వయం ఉపాధితో జీవనం
రొట్టెల తయారీతో మరో ఇద్దరికి ఉపాధి

6



వీల్‌చైర్‌లోనే కూర్చుని రొట్టెలు కాలుస్తున్న జయశ్రీ



గడిగ చెన్నప్ప సర్కిల్లోని క్లాక్ టవర్

6


ప్రారంభానికి క్లాక్‌టవర్ ఎదురుచూపులు..

- పనులు పూర్తయి రెండు నెలలైనా పట్టించుకోని అధికారులు

రాజకీయాలకు దూరంగా క్రికెట్ కొనసాగాలి

- క్రీడా కార్యక్రమాలకు నన్నెందుకు ఆహ్వానించారో తెలియదు
- డీసీఎం డీకే శివకుమార్

వివరాలు 7లో..



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1627.22	1,589.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	453	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,895	779
నీటి నిల్వ (టీఎంసీలు)	83.99	10.48

ప్రారంభానికి క్లాక్‌టవర్

ఎదురుచూపులు..

బళ్లారి సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని గడిగి చెన్నప్ప సర్కిల్లో ప్రజాపనుల శాఖ నిర్మించిన 110 అడుగుల క్లాక్‌టవర్ ప్రారంభోత్సవంపై అయోమయం నెలకొంది. నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి నవంబర్ 2న ప్రారంభిస్తారని అధికారులు ప్రకటించారు. రాత్రి పగలు కష్టపడి పనులు పూర్తి చేశారు. పనులు పూర్తికావడంతో టవర్ క్లాక్‌ను టార్పాలిన్లతో కప్పిపెట్టారు. ప్రారంభోత్సవం వాయిదా పడింది. నాటి నుంచి రెండునెలలు గడిచినా ప్రారంభానికి నోచుకోలేదు. గాలికి టవర్‌పై కప్పిన కవర్ చినిగిపోయి, దుమ్ముతో నిండిపోతోంది. ఈసర్కిల్ నుంచి దుర్గమ్మ గుడి రైల్వే అండర్‌పాస్ వరకు రోడ్డు విస్తరణ కోసం గాంధీభవన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని ఎలాంటి మంజూరు, ముందస్తు టెండర్ లేకుండానే కార్పొరేషన్ క్లియర్ చేసింది. పెట్రోల్ బంకులో నిలుపుదల ఆర్డర్ తీసుకురావడంతో ఈపని కూడా ప్రారంభం కాలేదు. రాజ్‌కుమార్ రోడ్డులో మిగిలిన పనుల్లో కూడా జాప్యం జరుగుతోంది. ఎమ్మెల్యేలు అనుకున్నట్లు జరిగితే ఈ సుందరమైన సర్కిల్ ప్రజలకు అంకితం అయి ఉండాల్సింది. నగరం మరింత సుందరంగా దర్శన మిచ్చేది. అధికారులు చొరవ తీసుకుని టవర్ క్లాక్‌ను ప్రారంభించాలని నగరవాసులు కోరుతున్నారు.

శరవేగంగా అండర్ పాస్ పనులు


రాత్రివేళల్లోనూ కొనసాగుతున్న పనులు

బళ్లారి సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని కనకదుర్గమ్మ దేవాలయం సమీపంలో రూ.కోట్ల నిధులతో రైల్వే అండర్ పాస్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇటీవల నగర ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి అండర్‌బ్రిడ్జి పనులను పరిశీలించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. త్వరగా పూర్తయితే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుందని ఎదురు చూస్తున్నారు.

సొసైటీ అధ్యక్షురాలిగా శిల్ప



బళ్లారిరూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్పీ సర్కిల్ సమీపంలో బళ్లారి సొసైటీ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బకెట్ గుర్తు అభ్యర్థి శిల్ప 34 ఓట్లతో అధ్యక్షురాలిగా విజయం సాధించింది. ఆమెను సభ్యులు, ప్రముఖులు అభినందించారు.

ముగిసిన ఆలంబాషా తాత ఉరుసు

సిరుగుప్ప, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దడేసూగూరు ఆలంబాషా తాత జియారత్ ఉత్సవాలు ఆదివారం కనుల పండువగా ముగిశాయి. సింధనూరు, సిరుగుప్ప తాలుకా మధ్య వెలసిన ఆలంబాష తాత ఉరుసులో భాగంగా మూడవ రోజు జియారత్ కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో దర్గాను పాల్గొని తాత ఆశీర్వాదాలు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.


అభివృద్ధికి నోచుకోని శబరి మండపం

సందర్శనకు దారేదీ..?

● పర్యాటక క్షేత్రాలకు దారి చూపని అధికారులు ● వెలుగులోకి రాని ప్రముఖ ప్రాంతాలు

కంప్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పర్యాటక క్షేత్రం హంపిలో పురాతన కట్టడాలకు కనీసం దారి లేకుండా పోయింది. చక్రతీర్థం వద్ద ఉన్న శబరి మఠం, త్రేతాయుగంలో సీత కోసం కిష్కిందలో తుంగభద్రపై ఏర్పాటు చేసిన వంతెన పురాతన కాలం నాటివి. ఇలాంటి చారిత్రక ప్రదేశాలను కాపాడడంలో పురావస్తు శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కనీసం వాటి సందర్శనకు పర్యాటకులకు అవకాశం లేకుండా చేయడం విచిత్రం . ప్రము ఖ పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటికి రహదారులు అభివృద్ధి చేసి నామఫలకాలు, భావచిత్రపటాలు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉండి. వాటిని వినియోగంలోకి తెస్తేనే పర్యాటకులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. హంపిలో పర్యాటకులు ఇప్పటికీ వీక్షించని ప్రాంతాలు చాలా వున్నాయి. కేవలం విరుపాక్షేశ్వరస్వామి ఆలయం, పుష్కరేణి, నవదిబ్బ, ఏకశిలా రథం, కోదండరామస్వామి దేవస్థానం, ఇలా ప్రధానమైనవి మాత్రమే తిలకించి వెళుతున్నారు. కానీ ఇంకా వెలుగులోకి రాని ప్రధానమైన ప్రాంతాలు చాలా వున్నాయి. అలాంటి వాటికి గుర్తింపు తేవాలని పర్యాటకులు కోరుతున్నారు.


విరూపాపురం గడ్డవద్ద నదిపై ధ్వంసమైన వంతెన

పట్టుదలకు జైశ్రీ..!


పొయ్యిపై రొట్టెలు కాలుస్తూ...

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 29(ఆన్‌లైన్): జీవితంలో అనుకోని సంఘటనలు.. విపత్కర పరిస్థితులు ఎదురు కావడం సహజం. అలాంటి సమయంలో కుంగిపోకుండా ధైర్యంగా పోరాడి స్వయం ఉపాధితో ఆదర్శనంగా నిలిచిందా మహిళ. సమస్యలను, ఒడిదుడుకులను ఎదురించి నిలబడినపుడే విజయం సాధించవచ్చని నిరూపించింది జయశ్రీ. తాను కష్టపడుతూ, మరో ఇద్దరికి ఉపాధినిస్తూ ఎందరో మహిళలకు, దివ్యాంగులకు ఆత్మవిశ్వాసం నింపుతోంది. నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.... జయశ్రీ... జీవితంలో చిన్నసమస్య వచ్చినా.. కుంగిపోయే యువతకు, మహిళలకు జయశ్రీ జీవితం ఆదర్శంగా నిలుస్తోందని చెప్పడంలో సందేహం లేదు. జీవితంలో ప్రతి యువతి వైవాహిక జీవితంలో అడుగు పెట్టినపుడు.. ఎన్నో కలలు కంటుంది... అవి నెరవేరాలని ఆశ పడుతుంది.... ఒక్కోసారి విధి వక్రించినపుడు సమస్యలు తలెత్తుతుంటాయి. అలాంటిదే జయశ్రీ జీవితంలో జరిగింది.

కొప్పళ జిల్లా పరిధిలోని ఇగిటి గ్రామానికి చెందిన జయశ్రీ గుళగణ్ణ ఎంఎస్‌డబ్ల్యూలో డిగ్రీ..పట్టా పొందింది. ఎన్నో ఆశలతో వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టింది. పెళ్లి అయిన తరువాత కవల పిల్లలు జన్మించారు. అయితే..జయశ్రీ ప్రసూతి సమయంలో సమస్య ఎదురైంది. డాక్టర్లు ఇచ్చిన అనస్తీసియా... కారణంగా దేహంలో ఏర్పడిన దుష్పరిణామాల ప్రభావంతో జయశ్రీ రెండు కాళ్ళు చచ్చుపడిపోయాయి. నడవలేని స్థితికి చేరుకుంది. అన్ని అవసరాలకు మరొకరి సహాయాన్ని పొందాల్సిన పరిస్థితిలో ....అత్తింటి నుంచి సమస్యలు ఎదురు కావడంతో పాటు కట్టుకున్న భర్త విడాకులు తీసుకుని ఇద్దరు పిల్లలను కూడా తీసుకెళ్ళి పోయాడు. దిక్కు తోచని స్థితిలో పుట్టింటికి చేరిన జయశ్రీ తల్లితండ్రులకు భారం కారాదని, చదువుకున్న విద్య వృథా కారాదని... జీవితంలో ఎదగాలని భావించింది. స్యాల్కో సంస్థ సహకారంతో జీవితంలో ఎలాగైనా ఆర్థికంగా ఎదగాలని సంస్థ ఇచ్చిన మిషన్ ద్వారా రొట్టెలు తయారు చేయడం నేర్చుకుంది. స్వయం ఉపాధి ప్రారంభించిన జయశ్రీ ప్రస్తుతం ఇద్దరు మహిళలకు ఉపాధినిస్తోంది. రోజూ సుమారు 500 రొట్టెలను తయారు చేసి మార్కెట్‌లో అమ్ముతోంది. ఐదు రూపాయలు ఒక రొట్టె చొప్పున 500 రొట్టెలు అమ్మడం ద్వారా వచ్చిన రూ 2500 ఆదాయంతో 500 రొట్టెలు తయారు చేయడానికి అవసరమైన అయ్యే ఖర్చు, మహిళల కూలి పోను ఆదాయం పొందుతూ జయశ్రీ జీవనం సాగిస్తోంది. జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లుకు కుంగిపోకుండా జీవనం సిగిస్తున్న జయశ్రీ నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. జీవితంలో ఎదుయ్యే సమస్యలను ఎదురించడం ద్వారా కొత్త జీవితాన్ని సాగిస్తున్న జయశ్రీ జీవన గాథే... ఉదాహరణకు తీసుకుని నేటి యువత ముందుకు నడవాలని ఆశిద్దాం....


స్యాల్కో సంస్థ ఇచ్చిన మిషన్‌లో పిండిని కలుపుతూ..

వేదవతిపై కొనసాగుతున్న

వంతెన పనులు


పీడీహళ్లి వద్ద పూర్తయిన సిమెంట్ పనులు

బళ్లారిరూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పీడీ హళ్లి వద్ద పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో పనులు వేగవంతం కావడంపై గ్రామీణ ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామీణ ప్రాంతాల నుండి పీడీహళ్లికి చేరుకుని ఇటు ఆంధ్ర అటు బళ్లారికి వెళ్లాలంటే గతంలో రోడ్డు గుంతలమయంగా వుండేది. ఈ వంతెన పూర్తయితే సరిహద్దు ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రమాదస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

కంప్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కురుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని మదిరి క్రాస్ వద్ద అక్రమంగా బియ్యం తరలిస్తున్న బొలెరో వాహనం బోల్తా పడి ఇద్దరు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆదివారం ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీఈ శోభారాణి పరిశీలిచాఆరు. ఘటనపై కురుగోడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లా ఎస్పీ శోభా రాణి , సీఐ విశ్వనాథ్, ఎస్ఐ విరుపాక్షప్పలు ఆదివారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రభుత్వ రేషన్ బియ్యంను కురుగోడు పట్టణానికి చెందిన యర్రిస్వామిగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ


భక్తులపై నడుస్తున్న పూజారి

ఘనంగా దండి దుర్గమ్మ జాతర

బళ్లారి సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దుర్గమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. దళిత పూజారి పి.సంతోష్ దండి దుర్గమ్మ దేవిజాతరలో దారి పొడవునా భక్తుల వీపుపై నడవడం ఇక్కడి ఆచారం. విజయనగరం జిల్లా అరసీకెరె గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన దండి దుర్గమ్మ దేవి జాతరలో భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున దండి దుర్గమ్మ దేవి వాగు వద్దకు వెళ్లి అక్కడ పూజలు నిర్వహించి మూడు రోజుల పాటు ఉపవాసం ఉన్న 5మంది దుర్గిలను పూజించారు. వాగు నుంచి ఆలయం వరకు 2కిమీటర్ల మేర అమ్మవారిని మోసిన పూజారి వివిధ వాయిద్యాలతో 'ఉదో ఉదో' అంటూ అరుస్తూ, భక్తుల వీపుల మీద నడిచారు. మూడు రోజుల పాటు అమ్మవారికి సమర్పించిన అన్నం, బెల్లం, పాలు, నెయ్యి, పెరుగు, అరటి పండు కలిపి ప్రత్యేక ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంచిపెడతారు. మూడు రోజులపాటు జరిగిన జాతరలో తొలిరోజు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపం వెలిగించి కార్తీకోత్సవం నిర్వహించి భక్తులు అమ్మవారికి వేప,అరటి పండు హారతి సమర్పించారు. శనివారం ఉదయం అలంకరించిన ఎద్దులను ప్రధాన వీధుల్లో ఊరేగించి అనంతరం అమ్మవారి ఆలయం చుట్టూ ఎద్దుల ప్రదక్షిణ చేస్తారు. మూడు రోజుల పాటు అరసీకెరె శక్తి దేవత శ్రీ దండి దురుగమ్మ దేవి జాతర ఉత్సవాలు, ఉత్సాహంగా జరిగాయి. ఈసందర్భంగా కే.రంగయ్య. వై.దేవేంద్రప్ప, ప్రశాంత్, గ్రామపంచాయితీఅధ్యక్షుడు ఇనాయత్‌ఉల్లా, కొట్రేశ్,శాంత్ పాటిల్, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పల్లె దారులంటే.. పట్టించుకోరంతే..!


గుంతలమయంగా వున్న కణివి-తిమ్మలాపురం రోడ్డు


అధ్వానంగా ఉన్న కంప్లి నుంచి కొట్టాలకు వెళ్లే రోడ్డు

కంప్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని పలు తాలుకాల్లో గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గోకంప్లి, కురుగోడు, సిరుగుప్ప, బళ్లారి గ్రామీణ విభాగాల్లో రోడ్లు గుంతలమయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొంటున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా కొన్ని రోడ్లు అభివృద్ధి నోచుకోవడం లేదు. గ్యారెంటీ కార్డు పథకాల వల్ల నిధులు లేక జిల్లా అభివృద్ధికి నోచుకోలేక పోయింది. డీఎంఎఫ్ నిధులున్నా కొన్ని తాలుకాలకే అభివృద్ధి పరిమితమైంది. మరికొన్ని తాలుకాల్లో అభివృద్ధి జరుగలేదు. సిరుగుప్ప- ఆదోని, సిరుగుప్ప- కంప్లి రోడ్లు, కంప్లి నుంచి కణివి తిమ్మలాపురం వెళ్ల రోడ్లు, కంప్లి కొట్టాల రోడ్డు, ఇతర గ్రామీణ విభాగాల రోడ్లు మరమ్మత్తులకు నోచుకోక అలానే ఉండిపోయాయి. ఇప్పటికైనా జిల్లా ప్రజాప్రతినిధులు రైతులు, విద్యార్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని త్వరగా అభివృద్ధి చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోటాపోటీగా సహకార ఎన్నికలు


దేవలాపురంలో ఓట్లు వేయడానికి వచ్చిన రైతులు

కంప్లి, డిసెంబరు 29(ఆంధ్ర జ్యోతి): తాలుకా పరిధిలోని దేవలాపురం గ్రామంలోని కృషి పత్తిన సహకార సంఘం డైరెక్టర్లుగా 12 స్థానాలు వుండగా 25 మంది నామినేషన్ వేశారు. ఆదివారం ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. మొత్తం 590 ఓట్లకు గాను 547 ఓట్లు పోలయ్యాయి అని ఎన్నికల అధికారి రేవన్న తెలిపారు. ఈ ఎన్నికలు దేవలాపురం గ్రామంలో ఎన్నడూ లేని విధంగా జరిగాయి. ఎలాంటి సంఘటనలు జరుగకుండా కుంరుగోడు, కుడితిని పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వారితోపాటు అధికారులు చంద్రశేఖర, పంపాపతి, లింగనగౌడ, తదితరులు వున్నారు.

పాముకాటుతో మహిళ మృతి


భారతి(ఫైల్)

కంప్లి, డిసెంబరు 29(ఆంధ్ర జ్యోతి): పాముకాటుతో మహిళ మృత్యువాత పడింది. విజయనగర జిల్లా అడగళి తాలుకాలోని తిమ్మలాపురం గ్రామంలో భారతి (31) ఆదివారం ఉదయం తమ ఇంటి ముందుండే పూలచెట్టులో పూలు కోస్తుండగా పాటు కాటు వేసింది. వెంటనే కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను హడగళి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రయోజనం లేకపోవడంతో ఉత్తమ చికిత్స నిమిత్తం గదగ్ ఆస్పత్రికు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

●12 తులాల బంగారు నగల స్వాధీనం

గోరంట్ల, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఇళ్లలో చోరీలు, ఒంటరిగా ఉన్న వృద్ధులను మోసం చేసి చోరీ చేసిన దొంగల ముఠాకు చెందిన సింహాద్రి, శివరాజ్ కుమార్, శ్రీహరిలను ఆదివారం అరెస్టు చేసిన్నట్లు పెనుకొండ డిఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితులనుంచి 12 తులాల బంగారు నగలు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీ ఆదివారం వివరించారు. లేపాక్షికి చెందిన సింహాద్రి, కర్నాటకలోని నగరిగేరేకు చెందిన శివరాజ్‌కుమార్, పాత నేరస్తులు, వీరిద్దరితోపాటు లేపాక్షికి చెందిన శ్రీహరితో కలిసి గత కొంతలకాలంగా గోరంట్ల, తదితర ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లలోనూ, ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలకు మాయమాటలు చెప్పి, వారి వద్ద ఉన్న బంగారు వస్తువులను చోరీ చేసేవారు. ఈయేడాది ఏప్రిల్ 3న గోరంట్లలోని బూడిదదిన్నెలో ఉంటున్న జయచంద్రా, వేణుగోపాల్ ఇళ్లలో తాళం పగలకొట్టి చోరీ చేశారు. రెండు బంగారు చైన్లు, జతకమ్మలు, నాలుగు ఉంగారాలు ఎత్తుకెళ్లారు. ఆగస్టు 30న ఎముకలగుట్లపల్లిలో శివమ్మ అనే వృద్ధురాలితో మీ ఆధార్, రేషన్‌కార్డు తనికీచేయడానికి వచ్చిన అధికారులమని ఆమె మంగళసూత్రాల చైన్ లాక్కెళ్లారు. సెప్టెంబరు 29న పెనుకొండ మండలంలోని కొండంపల్లికి చెందిన మంగమ్మ అనే వృద్ధురాలి నుంచి బంగారు తాలిబొట్టు చైను ఎత్తుకెళ్లారు. గోరంట్లలోని డిసెంబరు 26, 27 తేదీల్లో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఇరువురి వృద్ధురాళ్లకుబ్యాంక్ లోను వచ్చిందంటూ మాయ మాటలు చెప్పి, వారి చెవి కమ్మలు రెండుజతలు అపరిహరించారు. అలాగే పలు నేరాలకు సంబంధించిన బంగారు కమ్మలు, చైన్లు చోరీ చేశారు. కేసు నమోదు చేసిన గోరంట్ల పోలీసులు, డిఎస్పీ ఆధ్వర్యంలో సీఐ శేఖర్, పోలీస్ సిబ్బందితో బృందంగా ఏర్పడి నిందితులను పట్టుకుని, చోరీ సొమ్మును వారినుంచి రికవరీ చేశారు. ముగ్గురి వద్దనుంచి 12తులాల బంగారు చైన్లు, కమ్మలు, ఉంగారాలు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. ఇలాంటి మోసపూరిత మాటలు నమ్మి ప్రజలు మోసపోకూడదని, అప్రమత్తంగా ఉండాలని డిఎస్పీ ప్రజలను కోరారు. ఈసమావేశంలో సీఐ శేఖర్, ఎస్ఐ బాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

హోసూరు జోన్

కారు కిందపడి కుక్కపిల్ల మృతి

● పోలీసులకు ఫిర్యాదు


సీసీటీవీ పుటేజీలో రికార్డయిన దృశ్యాలు

హోసూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కారు కింద పడి కుక్కపిల్ల మృతి చెందడంపై జంతు పరిరక్షణ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆదివారం హోసూరు అన్నానగర్ ప్రాంతంలో నివాసముంటున్న ఓ వ్యక్తి ఆ ప్రాంతంలో తన కారును నడుపుకుంటూ వెళ్తుండగా రెండు పిల్లలతో తిరుగుతున్న వీధి కుక్క కారుకు అడ్డంగా వచ్చింది. హారన్ వేయగా వెళ్లిపోయినట్లు భావించి అతను ముందుకెళ్లాడు. అయితే టైర్ల కింద పడిన ఒక కుక్క పిల్ల మృతి చెందింది. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ పుటేజీలో రికార్డు నమోదైంది. అనిమల్ క్రూయెల్టీ ప్రివెన్షన్ సొసైటీ తీవ్రంగా ఖండించింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ వ్యక్తిని విచారించారు. హరన్ వేయగా రెండు కుక్కలు పారిపోయాయనుకున్నానని, పొరపాటుతోనే తప్పు జరిగిందని అంగీకరించాడు. అయితే తల్లి కుక్కకు చిన్న పాటి దెబ్బ తగిలిందని తెలుసుకుని ఆ కుక్క వైద్యానికి అయ్యే ఖర్చు తానే భరిస్తానన్నారు. అంతే కాక మరో కుక్కపిల్లను దత్తత తీసుకుని పెంచుకుంటానని రాతపూర్వకంగా హామీ ఇచ్చాడు.

తీగ కూరగాయలకు పెరిగిన డిమాండ్

హోసూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు, కెలవరపల్లి, బాగలూరు, కెలమంగలం తదితర ప్రాంతాల్లో పందిరి వేసి కూరగాయలు పొట్లకాయ, దొండకాయ, బీరకాయ, చిక్కుడుకాయ, కాకరకాయ వంటి వాటి వాటిని సాగు చేస్తున్నారు. ఇటీవల పలు కారణాలతో వీటి సాగుపట్ల కాస్త ఆసక్తి తగ్గింది. అయితే సరిహద్దులోని కేరళ, కర్ణాటక రాష్ట్రల్లో పొట్లకాయకు మంచి ఆదరణ లభిస్తుండడంతో కొద్ది మంది రైతులు మాత్రమే పొట్లకాయను సాగు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలో కిలో రూ.30 ధర పలికిన దొండకాయకు కూడా డిమాండ్ పెరిగింది.


దొండకాయ తీగలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రన్

త్రోబాల్ విజేత జట్టుకు అభినందన

హోసూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హోసూరు నగరంలో రెండు రోజుల పాటు ఇండియా-శ్రీలంక జట్ల మధ్య పోటీలు జరిగాయి. అండర్ 21 విభాగంలో మహిళలు, పురుషుల జట్లు పాల్గొన్నాయి. శ్రీలంక జట్టు నుంచి 32మంది మహిళలు, ఇండియా జట్టునుంచి 32మంది పురుషులు పాల్గొన్నారు. శని, ఆదివారాలలో ఆదియమాన్ కళాశాల ఇండోర్ స్టేడియంలో త్రోబాల్ పోటీలు జరిగాయి. విజేతగా నిలిచిన క్రీడాకారులు ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. పోటీలను హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సత్య ప్రారంభించారు. పలు రౌండ్లలో ఫైనల్స్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మహిళల విభాగంలో భారత జట్టు 21-24 పాయింట్ల తేడాతో శ్రీలంక జట్టును వరుస సెట్లలో ఓడించి చాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. గెలుపొందిన జట్లను అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రన్, ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ వినీత్ చంద్రశేఖర్ పతకాలు, ట్రోఫీలను అందజేసి అభినందించారు.


నిరాడంబరంగా కవి కువెంపు జయంతి

రాయచూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కవి దివంగత కువెంపు జయంతిని ఆదివారం నగరంలోని కన్నడ భవన్‌లో నిరాడంబరంగా నిర్వహించారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన నేపథ్యంలో ప్రముఖ సాహితీవేత్త, కవి కువెంపు జయంతిని జిల్లా అధికార యంత్రాంగం, నగరసభల ఆధ్వర్యంలో నిరాడంబరంగా నిర్వహించారు. దివంగత కవి చిత్రపటానికి సాహితీవేత్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్నడ సాహిత్యభివృద్ధిలోను, సాహిత్య రంగంలో కువెంపు చేసిన సేవలను గుర్తు చేసుకుంటు ఆయనకు నివాళులర్పించారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

రమణ మహర్షి (జయంతి)



రమణ మహర్షి 1879 డిసెంబరు 30న తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిలో జన్మించారు. 16ఏళ్లకే మోక్ష జ్ఞానం పొంది తిరువణ్ణామలైలోని అరుణాచల పర్వతాలపై స్థిర పడ్డారు. తనను తాను 'అతి యాశ్రమి'గా ప్రకటించుకున్నారు. భక్తులు ఆయనను 'భగవాన్'గాను, దక్షిణామూర్తిగా పిలిచేవారు. ఆయన బోధనలలో ప్రధానమైనది 'మౌనం', విశ్వజనీయమైన 'ఆత్మజ్ఞానం' ప్రధానాంశంగా ఉండేది. 'స్వీయశోధన' ఉత్తమమని సూచించేవారు. 1950 ఏప్రిల్ 14న నిర్యాణం చెందారు.

కొప్పరపు వేంకటరమణ కవి (జయంతి)




కొప్పరపు సోదర కవులలో ఒకరైన వెంకటరమణ కవి 1887 డిసెంబరు 30న ప్రకాశం (పూర్వం గుంటూరు) జిల్లా కొప్పరం గ్రామంలో జన్మించారు. తెలుగు సాహిత్య అవధానంలో జంట సోదరకవులు. వేంకట సుబ్బరాయ కవి, వేంకట రమణ కవి అన్నదమ్ములు. 16ఏళ్ల నిండకనే ఆశుకవిత్వాన్ని ప్రదర్శించి కొప్పరపు కవులుగా పేరొందారు. ప్రబంధశైలిలో గంటకు 500 పద్యాలు చెప్పేవారు. ఆశు కవీంద్రసింహ, విజయఘంటికా, ఆశుకవి చక్రవర్తి, కవిరత్న తదితర బిరుదులు ఉన్నాయి. 1942 మార్చి 21న కన్నుమూశారు.

కేఎం మున్షీ (జయంతి)



విశ్వ హిందూ పరిషత్ సంస్థాపక సభ్యులలో ఒకరైన కన్హయలాల్ మనేకల్ (కేఎం) మున్షీ 1887 డిసెంబరు 30న గుజరాత్ రాష్ట్రం భారుచ్‌లో జన్మించారు. కలం పేరు ఘనశ్యామ్ వ్యాస్. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ పాల్గొన్నారు. వృత్తిరీత్యా న్యాయవాది, రచయిత, రాజకీయ నాయకుడు. భారతీయ విద్యాభవన్ సంస్థాపకుడు. గుజరాతీ, ఆంగ్ల, హిందీలలో పలు రచనలు చేశారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిగా, ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్‌గా వ్యవహరించారు. 1971 ఫిబ్రవరి 8న కన్నుమూశారు.

వేమూరి గగ్గయ్య (వర్ధంతి)



వేమూరి గగ్గయ్య 1895 ఆగస్టు 15న గుంటూరు జిల్లా వేమూరులో జన్మించారు. తొలితరం తెలుగు సినిమా నటుడు. హీరో, విలన్ పాత్రల్లో నటనకు పేరొందారు. సినిమాలలోకి రాకముందు నాటకాలలో క్రూరపాత్రలకు పెట్టింది పేరు. ఖంగుమనే కంఠంతో ప్రతి అక్షరాన్నీ సుస్పష్టంగా పలుకుతూ రాగ, భావయుక్తంగా పాడి వన్స్‌మోర్‌లు కొట్టించుకునే వారు. నాటకాల్లో నటిస్తున్నప్పుడే ఆయన పద్యాలను, పదాలను గ్రామ్‌ఫోన్ రికార్డు కంపెనీలు రికార్డు చేసి సొమ్ము చేసుకున్నాయి. 1955 డిసెంబరు 30న కన్నుమూశారు.

చిత్తూరు నాగయ్య (వర్ధంతి)



దక్షిణాదిన 'పద్మశ్రీ' పొందిన తొలి నటుడు చిత్తూరు వీ నాగయ్య 1904 మార్చి 28న గుంటూరు జిల్లా రేపల్లెలో జన్మించారు. తెలుగు సినిమా నటుడు, సంగీతకర్త, గాయకుడు, దర్శకుడు, నిర్మాత. ఆయన నటించిన పోతన, త్యాగయ్య, వేమన, రామదాసు వంటి అనేకపాత్రలు బహుళ ప్రజాదరణ పొందాయి. త్యాగయ్య సినిమా చూసి మైసూరు మహారాజు 101 బంగారునాణేలు, కంఠాభరణంతో సత్కరించారు. 336కుపైగా సినిమాలలో నటించారు. 1973 డిసెంబరు 30న కన్నుమూశారు.

విష్ణువర్ధన్ (వర్ధంతి)



కన్నడ సినీరంగంలో 'సాహస సింహ'గా పేరొందిన డాక్టర్ విష్ణువర్ధన్ 1950 సెప్టెంబరు 18న మైసూరులో జన్మించారు. కన్నడ, హిందీ, తెలుగు, తమిళం, మళయాళం భాషలలో 200కుపైగా సినిమాలలో నటించారు. అభిమానులచే 'అభినవ భార్గవ'గా పిలవబడ్డారు. బెంగళూరులోని బనశంకరి దేవస్థానం నుంచి కెంగేరికి వెళ్లే 14.5కిలోమీటర్ల రోడ్డుకు ఆయన పేరుపెట్టారు. పలు అవార్డులు పొందారు. 2009 డిసెంబరు 30న గుండెపోటుతో కన్నుమూశారు.

విక్రమ్ సారాభాయ్ (వర్ధంతి)



అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు ఆద్యుడైన విక్రమ్ అంబాలాల్ సారాభాయ్ 1919 ఆగస్టు 12న జన్మించారు. భౌతిక శాస్త్రవేత్తగాను, అంతరిక్ష శాస్త్రవేత్తగాను రాణించి సాంకేతిక పరిజ్ఞాన ఉపయోగాన్ని సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని తద్వారా దేశంలోని పలు సమస్యలను పరిష్కరించవచ్చునని తోటి శాస్త్రవేత్తలను ప్రోత్సహించారు. 'ఇస్రో' సంస్థాపకులు. 1971 డిసెంబరు 30న కన్నుమూశారు. మరణానంతరం 'పద్మ విభూషణ్' ప్రకటించారు.

టైగర్ వుడ్స్ (పుట్టినరోజు)



ఎల్‌డ్రిక్ టాంట్ టైగర్ వుడ్స్ 1975 డిసెంబరు 30న జన్మించారు. అమెరికాకు చెందిన గోల్ఫ్ క్రీడా కారుడు. 18 వరల్డ్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్స్‌ను కైవశం చేసుకుని తనదైన రికార్డు సాధించారు. 'పీజీఏ ప్లేయర్ ఆఫ్ ఇయర్'గా 11సార్లు నిలిచారు. గ్రాండ్ సామ్ అందుకున్న యువ క్రీడాకారుడు. 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం' పురస్కారం, 'వరల్డ్ గోల్ఫ్ హాల్ ఆఫ్ ఫేమ్' గుర్తింపు, ఇతర అవార్డులు పొందారు.

మహిళ అదృశ్యం

కదిరి అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ మహిళ అదృశ్యమైనట్లు సీఐ నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. వలీసాబ్‌రోడ్డులో నివాసమున్న షేక్ రుబీనా 23వ తేదీన ఇంటి నుంచి బయటి కెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె భర్త షేక్ సాదిక్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రాజకీయాలకు దూరంగా క్రికెట్ కొనసాగాలి : డీకే

బెంగళూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ అంటేనే ప్రపంచంలోనే క్రేజీ ఉన్న క్రీడ అని రాజకీయాలకు దూరంగా ఉండాలని క్రీడాకారులే ఈ పరంపర కొనసాగించాలని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. బీసీసీఐ కమిటీలో జైషా ప్రస్తావనను పరోక్షంగా ప్రస్తావించారు. నగరంలో ఆదివారం చిన్నస్వామి స్టేడియంలో ఇండియన్ మాజీ క్రికెటర్ సయ్యద్ కిర్మాణి 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన జీవిత చరిత్ర స్టంప్డ్ లైఫ్ బియాండ్ ట్వంటీటూ యార్డ్స్ పుస్తకాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి, ఇండియన్ క్రికెటర్‌లు కపిల్‌దేవ్, బ్రిజేశ్‌పటేల్, అనిల్‌కుంబ్లే, రాహుల్‌ద్రావిడ్, వీవీఎస్ లక్ష్మణ్‌లు పాల్గొన్నారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ క్రీడలకు రాజకీయ నేతలు ప్రమాదకరమని, క్రీడా వ్యవహారాల్లో వారిని దూరంగా ఉంచాలని ఇది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. తానొక రాజకీయ నేతనే అయినా నన్ను ఎందుకు ఆహ్వానించారో తెలియదన్నారు. కిర్మాణికి ప్రత్యేక అభిమానినంటూ కొనియాడారు. పాఠశాల చదువుతున్నప్పుడే క్రికెట్ క్రేజ్ ఉండేదన్నారు. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజ్ కుమారుడు నా క్లాస్‌మేట్ అని అప్పట్లో పలు



పుస్తకావిష్కరణలో డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

మ్యాచ్‌లు చూశానన్నారు. మా నియోజకవర్గ యువతకు క్రికెట్ టిక్కెట్‌లు ఇచ్చి ఎన్నికల్లో గెలిచానన్నారు. కిర్మాణి అభిమానే కాకుండా నాకు మంచి మిత్రుడని అందుకే వచ్చానన్నారు.

తుమకూరు సమ్మేళనానికి సీపీఎం బృందం



సీపీఎం కార్యకర్తలు, అభిమానులు

బాగేపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సమగ్ర సమృద్ధ సౌహార్ద కర్ణాటక లక్ష్యంగా తుమకూరులో సీపీఎం 24వ రాష్ట్ర స్థాయి సమ్మేళనానికి తాలూకా నుంచి ఆదివారం బయల్దేరారు. పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి ఉదయం పెద్దసంఖ్యలో కార్యకర్తలు అభిమానులు తుమకూరుకు వెళ్లారు. ఈ సందర్భంగా ముని వెంకటప్ప మాటాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలతో రైతులు, కార్మికులు, దళితులు మహిళలు ఇలా మొత్తమ్మీద కష్టజీవులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆది, సోమ, మంగళవారాలలో మూడురోజులపాటు కేంద్ర, రాష్ట్ర పాలసీలను ఖండిస్తూ సమ్మేళనంలో ప్రతి అంశంపైనా పూర్తిస్థాయి చర్చలు ఉంటాయన్నారు. ప్రధానంగా పెట్టుబడిపాలసీలు అమలు చేసిన బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్‌లకు వ్యతిరేకంగా శ్రామికవర్గం కోసం ఒక పాలసీ తేవాలనే అంశంపై రాజకీయ చర్చలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు రఘురామరెడ్డి, బిళ్ళూరు నాగరాజు, చన్నరాయప్ప, కృష్ణప్ప, మునియప్ప, గూళూరు కృష్ణప్ప, ముస్తఫ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం

మహదేవపుర, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి ఉత్తమ ఆరోగ్యం ద్వారా స్వస్థ సమాజనిర్మాణమే లక్ష్యమని ఎస్‌కే ఫౌండేషన్ అధ్యక్షులు శాంతా కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. కేఆర్‌పుర నియోజకవర్గంలోని ఎస్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో పేద, ధనిక తేడా లేకుండా అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఇటీవలి కాలంలో పలు కారణాలతో ఒత్తిడి పెరిగిందని దీని ప్రభావం ఆరోగ్యంపై చూపుతోందన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని కన్ను, చెవి, దంత, హృదయం, ఎముకల సమస్యలపై పరీక్షలు చేయించి అవసరమైన వారికి చికిత్సలు అందిస్తున్నట్టు తెలిపారు. మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి చికిత్సలు అవసరమైన వారికి ఫౌండేషన్ భరిస్తోందన్నారు. ఇదే సందర్భంగా రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందచేసి అభినందించారు.



రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

ముగిసిన హవ్యక సమ్మేళనం



సమ్మేళనం వేదికపై స్వామీజీలు, మాజీ స్పీకర్ కాగేరి తదితరులు

బెంగళూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్యాలెస్ మైదానంలో ఏర్పాటైన తృతీయ విశ్వ హవ్యక సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. ఉదయం 8.30 గంటలకు గీతా-సంప్రీతా సహస్రకంఠాలతో భగవద్గీత పఠనం ప్రారంభమైంది. 81 మంది సైనికులను హవ్యక దేశరత్న, హవ్యక స్ఫూర్తిరత్న పురస్కారాలతో సత్కరించారు. సమ్మేళనంలో భాగంగా స్టార్టప్‌ల అంశాన్ని ప్రస్తావిస్తూ పరిశ్రమలు, ఉద్యోగాల సృష్టి అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. ఆయా రంగాల సాధకులు ఎలా రాణించారో తమ అభిప్రాయాలు, అనుభవాలను వ్యక్తం చేశారు. కాగా సరిహద్దుల్లో సైనికుల కాపాలాతోనే మనం సుభద్రంగా ఉండగలుగుతున్నామని హైకోర్టు న్యాయమూర్తి సందేశ్ అభిప్రాయపడ్డారు. 81మంది సైనికులకు హవ్యక దేశరత్న పురస్కార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. పురస్కారాలతో వారిపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. వ్యవసాయం, విద్య, మిలిటరీ, తదితర విభాగాలలో సాధకులను గుర్తించి గౌరవించడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. తగిన వయస్సులో వివాహం, గీతా పారాయణం పాటించడమే హవ్యక మనుగడ సాధ్యమవుతోందని శిరసి స్వర్ణవల్లి మఠం గంగాధరేంద్ర సరస్వతి స్వామిజీ అభిప్రాయపడ్డారు. డాక్టర్ జీ సోమేశ్వరజోషి మాట్లాడుతూ ఆధునిక వ్యవస్థలో నకార్మాతక భావాలతో వివాహ వ్యవస్థను కాదని అధర్మంవైపు యువత సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. కుటుంబ వ్యవస్థను గౌరవించి మనుగడ సాధించినప్పుడే సమాజంలో సరైన పురోగతి సాధ్యమని అభిప్రాయపడ్డారు. సమావేశంలో మాజీ స్పీకర్ విశ్వేశ్వరహెగ్డే కాగేరి తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

శిడ్లఘట్ట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మామిడితోటల నిర్వహణ కష్టం కాదని పూత వచ్చే సందర్భంలో కీటకాల నుంచి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యానవనశాఖ రిటైర్డు డైరెక్టర్ డాక్టర్ హిత్తలమని అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కంబదహళ్ళిలో సురేంద్రగౌడకు చెందిన మామిడి తోటను పరిశీలించి, ఎలాంటి సీజన్‌లో ఎలాంటి మందులు పిచికారి చేయాలనే విషయాలను వివరించారు. ఇతర పండ్లు, కూరగాయల మాదిరిగా మామిడి పండ్లుగా మారేవేళ ఎలాంటి పిచికారీ చేయకపోతే ఎలాంటి విషకారక అంశాలు ఉండవన్నారు. వర్షాకాలంలో నీటిని వృథా చేయకుండా సేకరించుకోవాలని, ప్రూనింగ్ చేయాలన్నారు. ఉత్తర కర్ణాటకలో కేవలం ఒకరకం మామిడి పండిస్తారని, జిల్లాలో పలురకాల మామిడి పెంచుతున్నారన్నారు. సింధూర, రసపురి, బాదామి, మల్లికా, మలగోబా, బంగినపల్లి, నీలం, తోతాపురి వంటి రకాలు ఉన్నాయన్నారు. వీటివల్ల ప్రయోజనం ఏమి టంటే మార్చి నుంచి ఆగస్టు వరకు సుమారు ఆరు నెలల పాటు మామిడి సీజన్ ఉంటూ రైతులకు అనుకూలంగా ఉందన్నారు. రైతు గగన్‌గౌడ మాట్లాడుతూ తాను 16ఏళ్లుగా మామిడి తోట పెంచుతున్నానని నిపుణుల సలహా మేరకు పూతదశలో సరైన మందులు పిచికారి చేస్తున్నట్టు తెలిపారు. తద్వారా మంచి పూత, కాయలు సాధ్యమన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా స్వయంగా నాణ్యత ప్రకారం కాయలు గ్రేడింగ్ చేసి మంచి ధర పొందవచ్చునన్నారు.



ఉద్యాన శాఖ రిటైర్డు డైరెక్టర్ డాక్టర్ హిత్తలమని

విద్యాహక్కుతోనే కన్నడ పాఠశాలల మనుగడ

బంగారపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు తప్పనిసరి అమలు చేయడం ద్వారా కన్నడ పాఠశాలల మనుగడ సాధ్యమని తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆర్ అశ్వథ్ అభిప్రాయపడ్డారు. జాతీయకవి కువెంపు జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని కువెంపు సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కన్నడ భాష, నేల, జలాలకోసం విశ్వమానవ సందేశాన్ని కువెంపు అందించారన్నారు. ఆయన సాహిత్యం కన్నడిగుకు సదా స్ఫూర్తిగా ఉంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో దశలవారీగా కన్నడ పాఠశాలలు మూతపడే ప్రమాదం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. 2012-13లో 44,991 కన్నడ పాఠశాలలు ఉండగా ప్రస్తుతం 41,911కు తగ్గాయన్నారు. కన్నడ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గడం కూడా ఒక కారణమన్నారు. మరోవైపు ఉపాధ్యాయుల కొరత వేలల్లో ఉందన్నారు. మౌలిక సదుపాయాలు, లైబ్రరీ, తరగతి గదుల కొరత సమస్యలు ఉన్నాయన్నారు. ఇకనైనా పాలకులు ఈ అంశంపై దృష్టి సారించాలని కోరారు. హైస్కూల్ స్కూల్‌అసిస్టెంట్‌ల సంఘం అధ్యక్షుడు ఎల్ రాజప్ప మాట్లాడుతూ కన్నడలో తొలి జ్ఞానపీఠ పురస్కారం పొందిన కువెంపు సాహితీరంగంలో గొప్పవారన్నారు. కార్యక్రమంలో చుటుకు సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎల్ రామకృష్ణప్ప, ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మధుసూధన్, శివకుమార్, అనికేతన బళగ అధ్యక్షుడు రామప్రసాద్ పాల్గొన్నారు.



కువెంపు విగ్రహం వద్ద నివాళులు

బెంగళూరులో బీరేశ్వర కో-ఆపరేటివ్ శాఖలు

బెంగళూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా ఎక్సంబావా బీరేశ్వర కో-ఆపరేటివ్ సొసైటీ బెంగళూరు పరిధిలో రెండు శాఖలను ఏర్పాటు చేసింది. నగరంలోని బసవేశ్వరనగర, నెలమంగలలో శాఖలు తెరిచారు. చిక్కోడి మాజీ ఎంపీ అన్నాసాహెబ్ జొల్లె వ్యవస్థాపకుడిగాను, మాజీ మంత్రి శశికళ జొల్లె సహ వ్యవస్థాపకురాలిగా ఉండే బీరేశ్వర సొసైటీలు ఇప్పటి వరకు 222 శాఖల ద్వారా సేవలందిస్తోంది. తాజాగా శనివారం రెండుశాఖలతో 224కు పెరిగాయి. బీజేపీ రైతుమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భారతి మల్లికార్జున్ మాట్లాడుతూ కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. సొసైటీల విశ్వాసం ముఖ్యమన్నారు. ఒక్కలిగల సంఘం ముఖ్యులు, కిమ్స్ మెడికల్ కళాశాల సీనియర్ వైద్యులు డాక్టర్ ఆంజినప్ప, జనరల్ మేనేజర్ బహద్దూర్ గురవ్ పాల్గొన్నారు. అన్నాసాహెబ్ జొల్లె మాట్లాడుతూ 35ఏళ్లుగా సేవలందిస్తోందని 4వేల కోట్ల డిపాజిట్లు, 3,100 కోట్ల రుణాలు ఇచ్చామని, 4లక్షలమంది సభ్యులు ఉన్నారని, దక్షిణ భారత్‌లో అతిపెద్ద కో-ఆపరేటివ్ సొసైటీగా ఉందన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

శిడ్లఘట్ట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవలికాలంలో సైబర్ నేరాలు పెరిగాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో రైతులు, రీలర్‌లను ఉద్దేశించి నేరాల నియంత్రణ మాసోత్సవంలో భాగంగా పోలీసుశాఖ చేపట్టిన చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేవలం పోలీసుల ద్వారానే మాత్రమే నేరాల నియంత్రణ సాధ్యం కాదని, ఇందుకు ప్రజల సహకారం కూడా ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు నెలను నేరాల నియంత్రణ మాసంగా ప్రభుత్వం ఆచరిస్తోందన్నారు. కాగా పట్టుగూళ్ల మార్కెట్‌లో లక్షలాదిరూపాయల లావాదేవీలు జరుగుతుంటాయని, మార్కెట్‌కు వచ్చే రైతులు, రీలర్‌లు సైబర్ నేరాలకు గురికాకుండా కనీస జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రధానంగా మెసేజ్‌లు పంపి సైబర్ నేరగాళ్లు కంగారు పెట్టేలా ఫోన్ చేసి ఫలానా అప్‌డేట్ చేయాలనే అపరిచిత కాల్స్ పట్ల స్పందించవద్దన్నారు. అంతేకాక డిజిటల్ అరెస్టు భయంతో రాష్ట్రంలో కోట్లాదిరూపాయలు నష్టపోయారని అప్రమత్తంగా ఉండడమే నష్టనివారణకు అడ్డుకట్ట సాధ్యమని అభిప్రాయ పడ్డారు. సమావేశంలో ఎస్సై వేణుగోపాల్, పట్టుగూళ్ల మార్కెట్ ఉప డైరెక్టర్ మహదేవయ్య, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.